# మెరుగైన మంచినీటి సరఫరాకు చర్యలు


కరీంనగర్‌లో అర్బన్ మిషన్ భగీరథలో భాగంగా ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్

- మున్సిపాలిటీల్లో సరఫరాకు ఇబ్బందులు లేకుండా కొత్త పైపులైన్లు
- వచ్చే 25 ఏళ్ల అంచనాతో ప్రణాళికలు తయారు

కార్పొరేషన్, డిసెంబర్ 14: నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లో మంచినీటి సరఫరాను మెరుగుపరిచేందుకు కొత్తగా విలీన గ్రామాల్లోనూ రోజూ సరఫరా చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ముఖ్యంగా పట్టణాల్లో వేసవిలో మంచినీటి సరఫరాలో వచ్చే సమస్యలను దృష్టిలో పెట్టుకున్న అధికారులు ఎక్కడా ఇబ్బందులు రాకుండా పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే మిషన్ భగీరథ కింద ఇంటింటికీ నీటి సరఫరా అందిస్తుండగా పట్టణాల్లోనూ ఇంటింటికీ నల్లా కనెక్షన్‌తో పాటు రోజూ మంచినీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా వివిధ పథకాల కింద మంజూరవుతున్న నిధులతో నీటి సరఫరా మెరుగుకు చర్యలు తీసుకునేందుకు పబ్లిక్ హెల్త్ విభాగం నుంచి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థలోని శివారు డివిజన్లతో పాటు హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో మంచినీటి సరఫరా పెంపు, కొత్తగా ఏర్పాటైన కొత్తపల్లి, చొప్పదండి మున్సిపాలిటీల్లో రిజర్వాయర్లు, సంపులు, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ పనులు పూర్తయితే నగరాలు, పట్టణాల్లో మంచినీటి సరఫరా విషయంలో ఇబ్బందులు తొలిగే అవకాశాలు ఉన్నాయి.

### మెరుగైన మంచినీటి సరఫరా

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటికే రోజూ మంచినీటి సరఫరా విజయవంతంగా కొనసాగిస్తున్నారు. అయితే, వేసవిలో మాత్రం తరచూ ఇబ్బందులు వస్తున్నాయి. వీటితో పాటు విలీన గ్రామాల్లో వేసిన పైపులైన్లు, రిజర్వాయర్ల నుంచే నీటి సరఫరా సాగుతుండడంతో తగినంత ప్రెషర్‌తో రావడం లేదు. దీనిని సవరించి ఈ ప్రాంతాల్లోనూ రోజూ మంచినీటి సరఫరా చేసేందుకు నగరపాలక సంస్థ నుంచి రూ. 20 కోట్లతో పైపులైన్లు, ఇతర పనులు చేపడుతున్నారు. అలాగే, కొత్తపల్లి, చొప్పదండి మున్సిపాలిటీల్లో రూరల్ భగీరథ ద్వారానే మంచినీటి సరఫరా సాగుతుండగా దానిని మెరుగుపరిచేందుకు కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటితో పాటు హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల పరిధిలోని కాలనీలు, విలీన గ్రామాల్లో మంచినీటి సరఫరా చేసేందుకు అధికారులు కొత్త ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటి ద్వారా కొత్త రిజర్వాయర్లు, నీటి సంపులు, అవసరమైన ప్రాంతాల్లో ఫిల్టర్ బెడ్స్ నిర్మాణం వంటి వాటిని చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేశారు. ఇందులో భాగంగానే కరీంనగర్‌లో 10 ఎంఎల్‌డీ ఫిల్టర్‌బెడ్ ఆధునీకరణ పనులు, ప్రస్తుతం సంపుతో పాటు మరో 1100 కేఎల్ సామర్థ్యంతో వాటర్ సంపు నిర్మాణం, మూడు పంపు సెట్లు, రేకుర్తి వరకు పంపింగ్ లైన్, కొత్తగా పలు కాలనీల్లో మంచినీటి పైపులైన్ల విస్తరణతో పాటు 400 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. అలాగే, కొత్తపల్లి మున్సిపాలిటీలో కొత్తగా స్టోరేజీ రిజర్వాయర్, మంచినీటి పైపులైన్ల విస్తరణ, 3 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న ఫిల్టర్‌బెడ్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్, మోటర్ల ఏర్పాటుకు ప్రతిపాదించారు. హుజూరాబాద్‌లో ఫీడర్ మెన్స్, పైపులైన్ల విస్తరణ, 2000కేఎల్ వాటర్ సంపు, చొప్పదండి మున్సిపాలిటీలో స్టోరేజీ రిజర్వాయర్, పైపులైన్ల విస్తరణ, పంపుహౌస్, జనరేటర్లు 2000 కేఎల్ సామర్థ్యంతో కూడిన సంపులు, జమ్మికుంటలో స్టోరేజీ రిజర్వాయర్, కాలనీల్లో కొత్త మంచినీటి పైపులైన్ల విస్తరణ, పంపింగ్ లైన్లు వేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నారు. వీటికి సంబంధించి పనులు చేపట్టి పూర్తి చేస్తే రాబోయే రోజుల్లో మంచినీటి సరఫరాకు ఇబ్బందులు వచ్చే అవకాశం ఉండదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# మంత్రిని కలిసిన క్రీడా సంఘాల బాధ్యులు


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న క్రీడా సంఘాల బాధ్యులు

కొత్తపల్లి, డిసెంబర్ 14 : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం ఉమ్మడి జిల్లాకు చెందిన పలు క్రీడా సంఘాల బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో క్రీడారంగ అభివృద్ధికి కృషి చేయాలని, పలు క్రీడల్లో అకాడమీలను ఏర్పాటు చేసేందుకు తమవంతు సహకారం అందించాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో జూడో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, రెజ్లింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, యోగా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు ఉన్నారు.


కురిక్యాలలో నర్సరీని పరిశీలిస్తున్న సర్పంచ్ నవీన్‌రావు

## హరితహారానికి మొక్కలు సిద్ధం

గంగాధర, డిసెంబర్ 14: హరితహారంలో భాగంగా కురిక్యాల గ్రామ పంచాయతీ పరిధిలో నాటడానికి మొక్కలు సిద్ధం చేస్తున్నట్లు సర్పంచ్ మేచినేని నవీన్‌రావు తెలిపారు. కురిక్యాల నర్సరీలో మొక్కల పెంపకం పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నవీన్‌రావు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీలో 10 వేల మొక్కలు పెంచడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. హరితహారంలో భాగంగా ఇంటింటికీ 6 పండ్లు, పూల మొక్కలు అందజేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో దారులకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడానికి అనువైన స్థలాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవోస్ నాయకులు

కొత్తపల్లి, డిసెంబర్ 14: జిల్లాలో శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించిన కలెక్టర్ పమేలా సత్పతిని గురువారం టీఎన్జీవోస్ జిల్లా నాయకులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో నాయకులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉద్యోగులందరినీ సమన్వయ పరుస్తూ దిగ్విజయంగా పూర్తి చేసినందుకు జిల్లా ఉద్యోగుల పక్షాన టీఎన్జీవోస్ నాయకులు అభినందనలు తెలిపారు. అలాగే, ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఉద్యోగులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మహిళా జేఏసీ నాయకులు ఇరుమల్ల శారద, సబిత, మాధవి, అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మీందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, జిల్లా నాయకులు గంగారపు రమేశ్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

## పీఆర్టీయూ టీఎస్ కార్యవర్గంలో జిల్లా ఉపాధ్యాయులకు చోటు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 14: పీఆర్టీయూ తెలంగాణ కార్యవర్గంలో పలువురికి చోటు కల్పించినట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్కు తిరుపతి రెడ్డి, మర్రి జైపాల్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో పీఆర్టీయూ కరీంనగర్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఇల్లందకుంట మండలం సిరిసేడు జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ ఉపాధ్యాయుడు పాకాల ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడిగా చిగురుమామిడి మండలం రామంచ జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ ఉపాధ్యాయుడు కుమారస్వామిని నియమించినట్లు వివరించారు.

## బాలికలు ధైర్యంగా ఉండాలి

కలెక్టరేట్, డిసెంబర్ 14: తమకు ఎదురయ్యే ప్రతికూల పరిస్థితుల్లో కూడా బాలికలు ధైర్యంగా ఉండి ఎదుర్కోవాలని చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్ సంపత్ సూచించారు. నగరంలోని పలు సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో గురువారం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఆధ్వర్యంలో బాలికా సాధికారత క్లబ్ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ, బాలికలు ఎదుర్కొంటున్న వేధింపులు, లైంగిక దాడులు, బాల్య వివాహాలు, లింగ వివక్ష, ఆరోగ్య సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని, పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ బృందం సభ్యులు సాయికిరణ్, ప్రియాంక, ఆయా వసతి గృహాలు, పాఠశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నైపుణ్య శిక్షణ తరగతులు

కొత్తపల్లి, డిసెంబర్ 14: నగరంలోని తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల (బాలుర)లో టాస్క్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 14: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అవనీ రెడ్డి, సుహర్ష్ రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథ్ తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథ్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీకాంత్, కోచ్ సురేందర్ సింగ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథ్ తదితరులు

# ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 14: కరీంనగర్ రూరల్ మండలంలోని గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహిస్తున్నారు. కాగా, గురువారం మందులపల్లి, దుబ్బపల్లి, ఫకీర్‌పేట, బహద్దూర్‌ఖాన్‌పేట, ఇరుకుల్ల, నల్లగుంటపల్లి, తాహెర్‌కొండాపూర్‌లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామసభలు నిర్వహించి, చేపట్టిన పనుల వివరాలు చదివి వినిపించారు. పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఏపీవో శోభారాణి, సర్పంచులు రాజమల్లు, దుర్గ, నందయ్య, తప్పట్ల భూమయ్య, బలుసుల శారద, అట్ల సంతోష, మడికంటి మమత, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


దుబ్బపల్లిలో గ్రామసభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు


మాట్లాడుతున్న ఆలయ ప్రధాన అర్చకుడు చరణాచార్యులు, పక్కన అయ్యప్ప స్వాములు

## ఆలయ అభివృద్ధికి విరాళం

చొప్పదండి, డిసెంబర్ 14: చొప్పదండిలోని శ్రీ వేంకటేశ్వర–మణికంఠ ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన పిల్లి ధర్మరాజు రూ.12 వేలు, మేడి మల్లేశం రూ. 12 వేల చొప్పున గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడిగె వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, కోశాధికారి దండె సత్యానందం, ఉపాధ్యక్షులు బొడిగె వెంకన్న, మునిగాల సుధాకర్, ఎన్నం మునీందర్, సభ్యులు పొరండ్ల భాస్కర్, ఉస్కె రాజశేఖర్ రెడ్డి, బత్తిని ప్రశాంత్, ఎన్నం శంకర్, పిల్లి ధర్మరాజు, గుర్రం సమర్ రెడ్డి, పిట్టల సత్యం, శశాంక్, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.